అనధికార లేఅవుట్ తొలగింపు

- నుడా అనుమతి లేకుండా పనులు
- ప్లాట్లు రిజిస్టర్ చేస్తున్న నిర్వాహకులు
- నుడాకు ఫిర్యాదు చేసిన స్థానికులు



అనధికార లేఅవుట్‌లో రోడ్లను తొలగింపజేస్తున్న డీసీపీవో శ్రీధర్‌రెడ్డి, పోలీసులు

నిజామాబాద్ సిటీ : ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు కొందరు. శ్మశాన వాటిక స్థలాలు, ప్రైవేట్ స్థలాలు సైతం కబ్జా చేసి అనధికార లేఅవుట్‌లు వేస్తున్నారు. అమాయకులకు వాటిని విక్రయించి రిజిస్ట్రేషన్ సైతం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా బల్దియా శివారులోని నెహ్రూనగర్‌లో వెలిసిన ఓ వెంచర్‌ను నుడా అధికారులు తొలగించారు. నగర శివార్లలోని నెహ్రూనగర్ జీపీ పరిధిలో సర్వే నెంబర్-480, 482లలో సుమారు 5 ఎకరాల్లో వెంచర్ చేస్తున్నారు. దీనికి గ్రామపంచాయతీ నుంచి నల్లా కనెక్షన్, నాలా కన్వర్షన్, లేఅవుట్ అనుమతి వంటివి ఏమీ తీసుకోలేదు. ఈ వెంచర్‌ను ఆనుకుని ఓ వర్గంవారి శ్మశానవాటిక ఉన్నట్లు కొందరు అభ్యంతరం తెలిపారు. ఓ వ్యక్తికి చెందిన భూమి ఉందని సైతం ఫిర్యాదులు చేశారు. అయినా ఖాతరు చేయకుండా వెంచర్ పనులు వేగవంతం చేశారు. నుడాకు దరఖాస్తు కూడా చేసుకోలేదు. ఇటీవల పనులు వేగవంతం చేశారు. ప్లాట్‌ల విక్రయాలు కూడా నిర్వహిస్తున్నారు. దీంతో స్థానికులు నుడా అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో మంగళవారం డీసీపీవో శ్రీధర్‌రెడ్డి.. టౌన్ ప్లానింగ్ అధికారులతో వెళ్లి విచారించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపేయించారు. తారు రోడ్డు వేస్తున్న మిషనరీలను పంపించేశారు. గతంలో పనులు చేయవద్దని సూచించినా ఖాతరుచేయకుండా పనులు చేస్తున్నారని జీపీ, మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఈ వెంచర్‌కు నుడా నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని డీసీపీవో తెలిపారు. అనుమతి లేని ప్లాట్‌లు కొనుగోలు చేసి మోసపోవద్దని స్థానికులకు సూచించారు.

బల్దియా టీపీవోగా ప్రదీప్ కుమార్



ప్రదీప్, టీపీవో

నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారిగా ప్రదీప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు టీపీవోగా ఉన్న సత్యనారాయణ పదవీ విరమణ చేపట్టడంతో ఆ స్థానం ఖాళీ అయింది. జమ్మికుంట కార్పొరేషనలో టీపీవోగా ఉన్న ప్రదీప్‌కుమార్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి టీపీవోగా చార్జి తీసుకున్నారు. టీపీవో రాకతో టౌన్‌ప్లానింగ్ విభాగం బలోపేతం అయ్యింది. గతంలో అధికారులు లేక పనులు అయ్యేవి కావు. ప్రస్తుతం ఇద్దరు ఏసీపీలు(అసిస్టెంట్ సిటీ ప్లానర్) శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డిలు ఉన్నారు. ఒక టీపీవో ప్రదీప్‌కుమార్. ఇద్దరు టీపీఎస్‌లు(టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్) అనుపమ, రాజేష్‌లు విధులు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు కొత్తగా ఆరుగురు టీపీబీవోలు (టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీల్) జాయిన్ అయ్యారు. దీంతో నిజామాబాద్ కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయి అధికారులున్నారు. ఏసీపీ-2గా ఉన్న శ్రీధర్‌రెడ్డి నుడాకు ఇన్‌చార్జి డీసీపీవోగా అదనపు బాధ్యతలు సైతం చేపడుతున్నారు. ఇకనైనా అక్రమ కట్టడాలు, అనుమతిలేని కట్టడాలు, ఆక్రమణల నివారణకు చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

చెక్‌డ్యాం పనుల పరిశీలన



తాడెంలో చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు

మోపాల్: మండలంలోని తాడెం వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను ఏఈ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. పనులు నిబంధనల ప్రకారం నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షాకాలం లోపు పనులు పూర్తయ్యే విధంగా చెక్‌డ్యాం పనులను నిరంతరం పరిశీలిస్తున్నామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చెక్‌డ్యాం పూర్తయితే భూగర్భజలాలు పెరగడంతోపాటు పంట పొలాలకు సాగునీరందుతుందని పేర్కొన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: కోనసముందర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన గాయత్రి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మధుపాల్ తెలిపారు. జిల్లాలోని తిర్మన్‌పల్లిలో అండర్-16 జూనియర్ బాలికల విభాగంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో గాయత్రి పాల్గొని ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. జనగామలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటుందని వివరించారు.

బోధన్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటాం

బోధన్‌టౌన్(బోధన్): రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బోధన్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షులు ఫయాజొద్దీన్ కుండబద్దలు కొట్టి చెప్పారు. పార్టీ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం రాత్రి పట్టణంలోని మెహర్బా ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. 20 కంటే ఎక్కువ సీట్లు ఎవరి మద్దతు లేకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కమిటీని ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మీర్ మజాజ్ అలీ, నాయకులు షమీ, ఖదీర్ పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలను తొలగించండి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో నాటిన కోనో కార్పస్ మొక్కలను తొలగించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ బల్దియా కమిషనర్ వెంకట నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే మొక్క కొనో కార్పస్ అని, ఈ మొక్క గాలి పీల్చడం వల్ల చర్మ, శ్వాసకోశ, అలర్జీ తదితర సంబంధిత వ్యాధులు వస్తాయని అన్నారు. ఈ చెట్లపై పక్షులు కూడా వాలవన్నారు. తక్షణమే ఈ చెట్లను తొలగించాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, పట్టణ మాజీ అధ్యక్షుడు బాలరాజు, నాయకులు పవన్‌కుమార్, కందికట్ల వాసు, యోగి, రాజు, గౌతం తదితరులు ఉన్నారు.

రాజారెడ్డి సేవలు మరువలేనివి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ దివంగత మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి సేవలు మరువలేనివని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మాజీ సర్పంచ్ గడ్డం రాజా రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ధన్‌పాల్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్య నారాయణ మాట్లాడుతూ.. గడ్డం రాజారెడ్డి సర్పంచ్‌గా సేవలందిస్తూనే ఉత్తమ రైతుగా ఉమ్మడి రాష్ట్రంలో ఆదర్శ రైతు అవార్డు అందుకోవడం సైతం విశేషమన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్‌గా రాజారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దోళ్ల గంగారెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, సుచరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడమే షీటీం ధ్యేయం

రుద్రూర్: మహిళలు, పిల్లలకు రక్షణ కల్పించాలనే దృక్పథంతో షీటీమ్ పని చేస్తుందని బోధన్ డివిజన్ షీటీం సభ్యులు విజయ్ కుమార్, సునయన అన్నారు. రుద్రూర్ మండలంలోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం షీటీం పనితీరు గురించి అవగాహన కల్పించారు. మహిళ చట్టాలు, టి-సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర అంశాల గురించి వివరించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్, పోతంగల్ మండలాలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు సరఫరా చేశారు. పోతంగల్ విశాల సహకార సంఘానికి 50 క్వింటాళ్లు, రుద్రూర్ మండలం రాయకూర్ సింగిల్ విండోకు 10 క్వింటాళ్లు, కోటగిరి విండోకు 30 క్వింటాళ్లు, ఎత్తొండ విండోకు 15 క్వింటాళ్లు, కొత్తపల్లి విండోకు 15 క్వింటాళ్ల చొప్పున సరఫరా చేశారు. సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఈద్గాలలో పనులు వేగంగా చేపట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ : వచ్చే నెలలో బక్రీద్ పండుగ ఉన్న సందర్భంగా ఈద్గాలలో ఏర్పాట్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌ను ఎంఐఎం, కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో వారు.. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిశారు. మైనార్టీలు అధికంగా ఉండే డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. అలాగే ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, స్లాటర్ హౌజ్‌ను ఆధునీకరించాలని విన్నవించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీలను పనులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

ఇందల్వాయి: ఇందల్వాయి కేజీబీవీలో ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ కాలేజీని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు, ఇందులో సీఈసీ గ్రూప్‌నకు 40 సీట్లు కేటాయించినట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, ఆన్‌లైన్ మెమో, జిరాక్స్‌కాపీలు, ఒక ఫొటో ఇవ్వాలన్నారు. మార్కుల ఆధారంగా సీటు కేటాయించనున్నట్లు వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్‌లో మంగళవారం ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు పుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కాలినడకన స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ గ్రామంలో శాంతి భద్రతల గురించి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు మరింత చేరువకావడానికి, ప్రజల్లో భద్రతా భావం, విశ్వాసాన్ని పెంచడానికి పుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్సై చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలు కొనసాగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఏఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకేశ్వర్ ఎంపీడీవో బదిలీ

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ఎంపీడీవో బ్రహ్మానందం బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన నెల రోజులకే ఆయన బదిలీపై ఆర్మూర్‌కు వెళ్లడం గమనార్హం. వచ్చీ రాగానే ఎంపీడీవో బదిలీ కావడంతో మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కొత్త ఎంపీడీవోగా ఎవరినీ నియమించకపోవడంతో ఎంపీవో లక్ష్మీప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



సానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్

- ప్రతి డివిజన్‌లో చెత్త సేకరణ జరగాలి
- ఉద్యోగుల హాజరు ఖచ్చితంగా తీసుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్

నిజామాబాద్ సిటీ : కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, ప్రతి డివిజన్‌లో చెత్త సేకరణ జరగాలని, విధుల్లో అలసత్వం వహిస్తే సస్పెన్షన్ వేటు తప్పదని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో శానిటేషన్ సిబ్బంది, అధికారులతో స్పెషల్ రివ్యూ నిర్వహించారు. డివిజన్ల వారీగా చెత్త సేకరణపై అధికారుల వివరణ తీసుకున్నారు. నగరంలో చెత్త సేకరణలో ఆలసత్వం వహిస్తున్నారని, అనధికార ఆబ్సెంట్‌ను ప్రోత్సహించవద్దన్నారు. విధులకు హాజరుకాకున్నా పర్మినెంట్ ఉద్యోగులకు హాజరు ఎందుకు వేస్తున్నారని పలు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ప్రశ్నించారు. ఇకపై విధులు సక్రమంగా నిర్వహించకుంటే సంజాయిషీ లేకుండా సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లపై పర్యవేక్షణ లోపించిందని శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్‌ను వివరణ అడిగారు. ఎంత స్థాయిలో ఉన్నా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఉద్యోగులు కచ్చితంగా డ్యూటీలు సక్రమంగా చేయాల్సిందేనన్నారు. తాను చార్జి తీసుకున్న తర్వాత వేతనాలు ప్రతి నెలా 5 లోపు వచ్చేలా చేస్తున్నానని తెలిపారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, సునీల్, మహిపాల్, షాదుల్లా, కృష్ణ పాల్గొన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక



మాల మహానాడు మండల కమిటీతో జిల్లా నాయకులు

మోపాల్ : మండలకేంద్రంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కం దేవిదాస్ అధ్యక్షతన మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సహా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు తలారి సాయన్న సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రొడ్డ ధన్‌రాజ్, కార్యదర్శిగా ఈదుల ప్రవీణ్, కోశాధికారిగా బైండ్ల సతీష్, ఉపాధ్యక్షులుగా గొర్కంటి జయరాజ్, అమ్ముల ఠాకూర్, జాయింట్ సెక్రటరీగా బట్టి సాయికుమార్, ఈసీ సభ్యులుగా రాజేశ్వర్, గంగాధర్, ఇలేందర్, దాస్, చిన్న సాయన్న, సలహాదారులుగా తలారి సత్యానందం ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా, రాష్ట్ర కమిటీకి ధన్‌రాజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మాలలు అన్నిరంగాల్లో రాణించేలా తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని, అందరినీ కలుపుకుపోతానని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూర పోశెట్టి, నాయకులు గంగాధర్, చంద్రకాంత్, నీరడి గంగాధర్, జిల్లా లీడర్ అడ్వైజర్ గోర్కంటి లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

మోపాల్ : మంచిప్పలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ, గజ్జెలమ్మ జాతర పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. సోమవారం రాత్రి జాతర సందర్భంగా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున నుంచి పెద్దమ్మ గుడి వరకు ప్రధాన వీధుల గుండా రథోత్సవం కొనసాగింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు.

కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్నాటక, మండలంతో పాటు ఇతర మండలాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. గెలుపొందిన మల్లయోధుడికి 5 తులాల వెండి కడియం బహూకరించారు. వీడీసీ అధ్యక్షుడు వెంకట్రాం నాయక్, రైటర్ గుండుల శ్రీనివాస్, సాయిరెడ్డి, అశోక్, బ్రహ్మం, మోహన్ రెడ్డి, జగదీష్ యాదవ్, శంకర్, శ్రీనివాస్, సాయిరాం, రాజేష్, ముత్యంరెడ్డి, భూపతిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మంచిప్పలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

కాసులు కురిపిస్తున్న కొత్తిమీర

- ఎకరానికి రూ. లక్ష వరకు ధర పలుకుతోందంటున్న రైతులు
- 45 రోజుల్లోనే పంట చేతికి..



కొత్తిమీర తెంపుతున్న రైతు కూలీలు

జక్రాన్‌పల్లి : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన కొత్తిమీర పంట కాసులు కురిపిస్తోంది. ధర ఎన్నడూ లేని విధంగా ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.లక్షా 10 వేల వరకు పలుకుతోంది. ఈ పంటను కొనడానికి వ్యాపారులు పోటీ పడుతున్నారు. కొత్తి మీర పంట 45 రోజుల్లో చేతికి వస్తుంది. కానీ వ్యాపారులు పంట వేసిన 30 రోజుల తర్వాత రైతులకు అడ్వాన్సులు చెల్లించి పంటను కొనుగోలు చేస్తున్నారు. రైతులు యాసంగి సీజన్‌లో జొన్న, పసుపు పంటను సాగు చేశారు. ఈ పంట కాలం ముగియగానే రైతులు కొత్తి మీరను సాగు చేస్తారు. ఫిబ్రవరి నుంచి మే నెల చివరి వరకు పలు దఫాలుగా రైతులు కొత్తిమీర పంటలను సాగు చేస్తారు. రైతులు ఒక సీజన్ కష్టపడినా రాని లాభం 45 రోజుల్లోనే వస్తుండడంతో రైతులు ఆనంద పడుతున్నారు. నీటి లభ్యత ఎక్కువగా ఉన్న జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్, మనోహరాబాద్, మునిపల్లి, లక్ష్మాపూర్, అర్గుల్, కలిగోట్, చింతలూర్ గ్రామాల్లోని రైతులు ఎక్కువగా ఈ పంటను సాగు చేశారు. రైతులు ఈ పంటను సాగు చేయడానికి ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఖర్చు చేశారు. దుక్కి అడుగు భాగంలో ఒకటి నుంచి రెండు బస్తాల కాంపొండ్ మిశ్రమ ఎరువులను వేస్తారు. పైపాటుగా పంటను కాపాడుకోవడానికి రసాయన మందులను పిచికారీ చేస్తారు. దీనికి రూ.5 వేల వరకు ఖర్చవుతుంది. మొత్తంగా కొత్తిమీర పండించడానికి ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చు అవుతుంది. తక్కువ సమయంలోనే కొత్తిమీర పంట చేతికి రావడం, మంచి ధర పలుకుతుండటంతో రైతులు ఈ పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. పండించిన కొత్తిమీర పంటను వ్యాపారులే తమ సొంత ఖర్చులతో కూలీల సహాయంతో మార్కెట్‌కు తరలించుకుపోతున్నారు. దీంతో రైతులకు ఎలాంటి కూలీల ఖర్చు ఉండదు. కేవలం పండించిన పంటను చూసిన వ్యాపారులు నిర్ణీత ధరను నిర్ణయించుకుని రైతులతో ఒప్పందం చేసుకుంటున్నారు.

లాభదాయకంగా ఉంది



యాసంగి సీజన్ ముగియగానే మార్చి చివరి వారంలో అర ఎకరంలో కొత్తిమీర సాగు చేశాను. అర ఎకరం కొత్తిమీరను రూ.50 వేల ధరకు అమ్ముకున్నాను. గతంలో ఎన్నడూ ఈ ధర లేదు. ప్రస్తుతం కొత్తిమీర పంటకు మంచి ధర వస్తోంది. రైతులు ఈ పంటను మార్కెట్‌కు తరలించాల్సిన అవసరం లేదు. వ్యాపారులే ఫీల్డ్ వద్దకు వచ్చి కూలీల ఖర్చులు వాళ్లే భరించుకుని కొత్తిమీరను తరలించుకుపోతున్నారు. మరో అర ఎకరం వేశా. పంట చేతికి రావడానికి మరో 15 రోజుల సమయం పడుతుంది. ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

– పురుషోత్తం, రైతు, పడకల్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 సింగిల్ -11.00, 4.40
- హిట్-1.30, 7.30
- జగదేకవీరుడు అతిలోక సుందరి-10.30
- స్క్రీన్-2 సింగిల్-1.30, 7.30, 10.30
- స్క్రీన్-3 జగదేకవీరుడు అతిలోక సుందరి-11.00, 4.30
- శుభం-1.40, 7.20, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 సచిన్-11.20,
- సింగిల్-1.40, 7.25, 10.10 -రైడ్-2(హిందీ)-4.25
- స్క్రీన్-2 తుడరుమ్-11.20
- శుభం-2.40, 5.20, 8.00, 10.40
- స్క్రీన్-3 జర్నీ-11.00 - రైడ్-2(హిందీ)-1.45
- కలియుగం-8.00 - హిట్-4.45, 10.25
- స్క్రీన్ -4 సీఎం పెళ్లాం-11.40
- జగదేకవీరుడు అతిలోకసుందరి-2.30
- బ్లైండ్‌స్పాట్-5.40- రైడ్-2(హిందీ)-7.45
- తుడరుమ్-10.40

లలితామహల్ శుభం **దేవి** సింగిల్
నటరాజ్ జగదేకవీరుడు అతిలోకసుందరి
విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	88,985		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	4	8	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	25	40	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	100	150	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	50	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	60	90	గోరుచిక్కుడు	40	60
కొత్తిమీర	50	80	చిక్కుడుకాయ	40	60
పుదీనా	50	80	మామిడికాయ	30	50
క్యాప్సికం	40	80			

–సుభాష్‌నగర్

రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి

నిజామాబాద్ నాగారం: పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవడానికి దేశవ్యాప్తంగా ఉత్సాహం కలిగిన యువతను భారత ప్రభుత్వం సమీకరిస్తోందని మేరా యువ భారత్ కార్యాలయం జిల్లా అధికారి, జిల్లా యువజన అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో పౌరులను అప్రమత్తం చేయగల దళాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం, లక్ష్యమన్నారు. స్థానిక అధికారులకు మద్దతు ఇవ్వడం ద్వారా పౌర రక్షణ వలంటీర్లు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తారని, రెస్క్యూ, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహ నియంత్రణ, ప్రజాభద్రత, విపత్తు, ప్రతిస్పందన, పునరావాస ప్రయత్నాలలో వీరు సహాయం చేస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన యువత https://mybharat.gov.in పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

చలివేంద్రాలు ప్రారంభం



ఖలీల్‌వాడి: నగరంలోని కోర్టుకి, రైల్వేస్టేషన్‌కి వచ్చే వారి దాహార్తి తీర్చడానికి కోర్టు సర్కిల్ వద్ద రైల్వే స్టేషన్ ఎదురుగా స్థానిక వస్త్ర దుకాణ యజమాని ప్రవీణ్ సహకారంతో ఏర్పాటు చేసిన రెండు చలివేంద్రాలను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ప్రారంభించారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని కులాల వారు కలిసి ఉండాలి

- ఏసీపీ రాజా వెంకటరెడ్డి

డిచ్‌పల్లి: గ్రామంలో అన్ని కులాలు, మతాల వారు కలిసి మెలిసి అన్నదమ్ముల్లా జీవించాలని చిన్నచిన్న వాటికి తగాదాలు పెట్టుకోవద్దని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి సూచించారు. మిట్టపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామానికి చెందిన 8 కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేసినట్లు బాధితులు కలెక్టర్, సీపీలకు సోమవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఏసీపీ రాజా వెంకటరెడ్డి డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ఇరువర్గాలను పిలిపించి విచారణ చేపట్టారు. ముందుగా బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తర్వాత వీడీసీ సభ్యులతో మాట్లాడారు. వీడీసీకి సాంఘిక బహిష్కరణ చేసే అధికారాలు ఉండవని తెలిపారు. బాధిత కుటుంబాలకు గ్రామంలోని అన్ని కులాల వారు సహకరించేలా వీడీసీ సభ్యులు కృషి చేయాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇలాంటి పనులు మరోసారి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వీడీసీ సభ్యులను హెచ్చరించారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.